క్లుప్తంగా

బీసీ ప్రజా సంఘం ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన కుడికాల వెంకటేశ్వర్లు తెలంగాణ బీసీ ప్రజా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు ఆదివారం నియామక పత్రం అందజేశాడు. తన నియామకానికి సహకరించిన నాయకులకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

టీఏఎస్ మండల అధ్యక్షుడిగా కుమార్



వర్ధన్నపేట: తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) మండల అధ్యక్షుడిగా నియమిస్తూ మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన గద్దం కుమార్‌కు నియామక పత్రాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దళిత గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడతానని చెప్పారు. అన్ని గ్రామాల్లో సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు జన్ను నర్సయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



పర్వతగిరి: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని ఇస్లావత్‌తండా శివారు మూడుతండాలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు మూడు వెంకన్న కథనం ప్రకారం.. ఆయనకున్న ఐదెకరాల పొలంలో ఏర్పాటు చేసిన గడ్డివాము ఆదివారం అగ్నిప్రమాదానికి గురై కాలి బూడిదైంది. తనకున్న మూగ జీవాలకు మేత లేకుండా పోయిందని వెంకన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనా స్థలానికి సర్పంచ్ ఇస్లావత్ రమేష్ నాయక్ వెళ్లి వెంకన్నను పరామర్శించి ఓదార్చారు. ఆర్థికసాయం అందిస్తానని భరోసా ఇచ్చాడు.

దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేత



వర్ధన్నపేట: పట్టణానికి చెందిన దివ్యాంగురాలు తంగలపెల్లి రజితకు స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి సొంత డబ్బుతో వీల్ చైర్ కొనుగోలు చేసి ఆదివారం అందజేశారు. వీల్ చైర్ లేక రజిత పడుతున్న అవస్థలు గుర్తించి వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి చొరవ తీసుకుని సొంత డబ్బుతో కొనుగోలు చేసి అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లమనేని మోహన్‌రావు, మాడిశెట్టి లక్ష్మణ్, సిలువేరు రాజు, తోట శ్రీనివాస్, పులి సత్యనారాయణ, బొంపెల్లి వెంకన్న, చిదరాల రమేష్, మైస వీరేందర్, మల్లికార్జున్, సోహేల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన నాగరబోయిన పెద్ద నర్సయ్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద నర్సయ్య సతీమణి రాజమ్మకు స్థానిక కాకతీయ పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో పొదుపు, బోనస్, అభయనిధి బీమా పరిహారం మొత్తం రూ.1.26 లక్షలను అధ్యక్షుడు నంగునూరి సాంబయ్య ఆదివారం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని సంఘం అధ్యక్షుడు, కార్యవర్గం పరామర్శించింది. పెద్ద నర్సయ్య మృతి బాధాకరమని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పుచ్చ స్వామి, కొత్తపల్లి రాజయ్య, ఎరెల్లి రాజేందర్, కొండబత్తుల నర్సింహరాములు, పెండ్యాల గిరి, పెండెం శ్రీనివాస్, కాసిడి అజయ్, ములకస్వామి, గణకుడు గుండె బోయిన రాజు పాల్గొన్నారు.

లెక్కలతో కుస్తీపట్టిన విద్యార్థులు

జిల్లా స్థాయి 'సాక్షి' స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీకి విశేష స్పందన

- 200 మందికిపైగా హాజరు
- ప్రతిభ కనబరిచిన వారు రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం



సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కాజీపేట: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో ఆదివారం స్పెల్ బీ, మ్యాథ్స్‌బీ జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు సోమిడిలోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొని ప్రాథమిక స్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వరంగల్ 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ వీ.శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా పైస్థాయి పోటీ పరీక్షలపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రీజినల్ స్థాయి పరీక్షలకు ఎంపిక అవుతారని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభా పాఠవాలను వెలికితీయడంలో 'సాక్షి' ఎప్పుడూ ముందంజలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటే విద్యార్థులు సెల్ నంబర్ 95055 14424లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ వర్దెల్లి లింగయ్యతో పాటు సాక్షి బృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల మనోగతం వారి మాటల్లో..

మరిన్ని మెళకువలు నేర్చుకున్నా..



సాక్షి స్పెల్‌బీలో పాల్గొనడం వల్ల గణితంలో మరికొన్ని సూత్రాలు, మెళకువలు నేర్చుకున్నాను. ఆ సూత్రాల వాడక విధానంపై అవగాహన కలిగింది. ఇప్పుడు ఎలాంటి జంకు లేకుండా గణిత శాస్త్రంలో అన్ని లెక్కలు చేయవచ్చనే నమ్మకం కలిగింది.

– బిల్విక, బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్

చాలా ప్రయోజనాలు ఉన్నాయి



సాక్షి స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల గణిత శాస్త్రంలో అనేక ప్రయోజనాలను అవగతం చేసుకున్నాను. గణితం మీద పట్టు సాధించడంతో జీవితంలో రాణించడానికి అనేక అవకాశాలు దక్కుతాయి.

– టీ.ధ్రువన్ సాయి, 5వ తరగతి, షైన్ ఉన్నత పాఠశాల

ప్రతిభకు సానబెట్టేందుకు..



విద్యార్థుల్లో ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు సాక్షి స్పెషల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. లెక్కల్లో తార్కిక ఆలోచన గణన పెంపొందుతాయి. విద్యార్థులకు ఇటువంటి పరీక్షలు బాగా ఉపయోగపడతాయి.

– ఎస్.సాత్విక్, స్టాండర్డ్ హైస్కూల్

పోటీ పరీక్షలు ఎంతో మేలు



పాఠశాల నుంచే పోటీ పరీక్షల్లో పాల్గొనడం మరచిపోలేని విషయం. వాటిలో పాల్గొనడం వల్ల అనేక అంశాలు అవగతం అవుతాయి. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తులు బయటపడతాయి. అనేక విషయాలను నేర్చుకోవచ్చు.

– చరణ్, వైబ్రెంట్ హైస్కూల్

సులువుగా మ్యాథ్స్‌పై పట్టు



నేను మహాత్మా జ్యోతిరావుపూలే ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాను. స్పెల్‌బీ మ్యాథ్స్ వల్ల అనేక నూతన అంశాలను నేర్చుకున్నాను. ఉపాధ్యాయులు బోధించే అంశాలను సులువుగా అర్థ చేసుకోవడంలో పట్టు సాధించాను.

– వై.వంశిక, ఎంజేపీ

ఫైనల్స్ వరకు వచ్చాను..



నేను కాజీపేట మండలం సోమిడి శివారులో ఉన్న తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాను. చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నా ఉన్నతికి దోహదపడుతున్నారు. ఫైనల్స్‌కు చేరుకోవడం ఆనందంగా ఉంది.

– ఎస్.మోక్షిత్, 5వ తరగతి, తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్

భయం పోయింది



గణితశాస్త్రంపై భయాన్ని పోగొట్టడంలో సాక్షి మ్యాథ్స్, స్పెల్‌బీ ఎంతగానో ఉపయోగపడ్డాయి. లెక్కలంటే కఠినం కాదని ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే అవగాహన కలిగింది. తోటి విద్యార్థులతో పోటీపడి హాజరుకావడం ద్వారా భవిష్యత్తుపై ఒక నమ్మకం కలిగింది.

–కే.నాన్శ్య, క్రియేటివ్ మోడల్ హైస్కూల్

గణితంపై పట్టు సాధిస్తున్న పిల్లలు



సాక్షి దినపత్రిక నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పోటీలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా మారాయి. గణితంపై భయాన్ని దూరం చేసేందుకు నూతన విధానాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన పరీక్షలు ఆసక్తికరంగా మారింది.

– తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

పత్తి కట్టెను భూమిలోనే కలియదున్నాలి

దుగ్గొండి: గులాబీ రంగు పురుగు ఉధృతి నేపథ్యంలో పత్తి పంట కొనసాగించే పరిస్థితి లేక పోయే తరుణంలో పత్తి కట్టెను పీకి తగులబెట్టకుండా ట్రాక్టర్ రోటోవీటర్ సాయంతో భూమిలోనే కలియదున్నాలని మండల వ్యవసయ అధికారి (ఏఓ) చిలువేరు దయాకర్ సూచించారు. ప్రస్తుతం పత్తి పంట కాలపరిమితి ముగిసింది. గులాబీ రంగు పురుగు ఉధృతి పెరిగింది. ఇంకా పంట కొనసాగించే పరిస్థితి లేదు. దీంతో రైతులు పత్తి స్థానంలో రెండో పంటకు సిద్ధం అవుతున్నారు. మండలంలో 13 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పత్తి దిగుబడులు ఆశించిన మేరకు రాలేదు. ఎకరాకు 3–5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సాగునీరు అందించి పత్తి కొనసాగిద్దామంటే గులాబీ రంగు పురుగు విపరీతంగా వ్యాపించింది. దీంతో చేసేదేమీ లేక రైతులు పత్తిని తీసేసి రెండో పంటగా మొక్కజొన్న, వేరుశనగ, బొబ్బెర, మినుము, పెసర, నువ్వుల పంటలు సాగు చేసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. అయితే పత్తి కట్టెను తీసేసి కాల్చకుండా నేలలోనే కలియదున్నితే భూమిలో సేంద్రీయ ఎరువులు అందుబాటులోకి వస్తాయని ఏఓ చెప్పారు. పశు సంపద లేకపోవడంతో సేంద్రీయ ఎరువులు వాడటం లేదు. ఈ క్రమంలో భూసారం తగ్గుతోంది. మెరుగైన దిగుబడి ఇచ్చే పంట రావాలంటే భూసారం బాగుండాలి. నేలలో సేంద్రీయ కర్బన పదార్థాలు అందుబాటులో ఉంటే భూమి బలంగా ఉండటంతోపాటు వేసిన రసాయనిక ఎరువులను సైతం తీసుకుంటుంది. ఎకరం పత్తి చేలో 10–30 క్వింటాళ్ల పత్తి కట్టె ఉంటుంది. ఎకరం పత్తి కట్టె ద్వారా 5–30 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ నేలకు అందుతాయి. సూక్ష్మపోషకాలు సైతం లభిస్తాయి. నేలలో నీటిని ఎక్కువకాలం నిలుపుకునే శక్తి వస్తుంది.

మలుపులు.. ముళ్లపొదలు

- ప్రమాదకరంగా ఎల్గూర్ రంగంపేట చెరువు కట్ట దారి
- ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం



మూలమలుపు వద్ద రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

సంగెం: అదమరిస్తే అంతే సంగతులు.. అన్నట్టుగా ఉంది ప్రయాణికుల పరిస్థితి. మండలంలోని ఎల్గూర్ రంగంపేట నుంచి మొండ్రాయికి వెళ్లే చెరువు కట్టపై ఉన్న పంచాయతీరాజ్ రోడ్డుకు పదుల సంఖ్యలో మలుపులున్నాయి. అంతేకాకుండా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు బీటీ రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలుమార్లు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. సంగెం మండల ప్రజలతోపాటు గీసుకొండ, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాల్లోని గ్రామాల ప్రజలు నిత్యం వివిధ గ్రామాలకు వచ్చి వెళ్లడం పరిపాటి. పలు పాఠశాలలకు చెందిన స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు, ఆటోలు, ట్యాక్సీలు, ఇతర వాహనాలు ఈ దారి మీదుగానే ప్రయాణిస్తాయి. దారికి ఇరువైపులా ముళ్లపొదలు, ఇతర మొక్కలు చొచ్చుకుని రావడంతో రోడ్డు బాగున్న చోట సైతం ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి నెలకొంది. ఇక మూలమలుపుల వద్ద పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ప్రమాదాల తీవ్రత పెరిగి ప్రాణాలు గాలిలో కలిసిన తర్వాత స్పందిస్తారా..? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను, పిచ్చిమొక్కలు తొలగింపజేసి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలు



నల్లబెల్లి: మండల కేంద్రంలోని పరితోమా దేవాలయంలో చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి ఈపీ.ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేసి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభువు ఆశీర్వాదంతో ప్రజలకు శాంతి, సమాధానం కలగాలని ఆకాంక్షించారు. చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ పాస్టరేట్ సెక్రెటరీ నాగెల్లి ప్రకాష్, సంఘ పెద్దలు పాడేటి ప్రకాశం, పరికి త్యాగరాజు, కల్లెపల్లి రఘువరణ్, పాడేటి నవీన్, ఈదునూరి విజయ్‌కుమార్, జన్ను రంజిత్, కనుకం శ్రీకాంత్, సునీల్, వక్కల దిలీప్, కుక్కముడి సుమన్, స్త్రీల మైత్రి సెక్రెటరీ నాగెల్లి పావని, పరికి సువర్ణ, మనుగొండ శ్రీలత, వక్కల రజిని తదితరులు పాల్గొన్నారు.

'మార్గం' ఆధ్వర్యంలో వృద్ధ, అనాథాశ్రమం

సంగెం: వరంగల్‌కు చెందిన మార్గం స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వృద్ధ, అనాథాశ్రమం ఏర్పాటు చేసినట్లు అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ సురేష్, సింగారపు బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసరాలేని వృద్ధులను, అనాథ బాలలను చేర్చుకుని ఉచిత వసతి, పోషణ కల్పిస్తామన్నారు. అనాథ పిల్లలకు చదువు చెప్పిస్తామని వివరించారు. తల్లిదండ్రులు లేదా తల్లి లేదా తండ్రి కానీ లేని 6 నుంచి 18 ఏళ్లలోపు వయస్సున్న 40 మంది పేద పిల్లలకు అవకాశం ఉందని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 7801078784లో సంప్రదించాలని కోరారు.

దహన సంస్కారాలకు సాయం

దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బండి సారయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా దహన సంస్కారాల కోసం మాజీ సర్పంచ్ బైరి లలిత రమణారెడ్డి రూ.10 వేల సాయం అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామానికి చెందిన పలువురు బాధిత కుటుంబానికి తోచిన మేరకు ఆర్థికసాయం అందించారు.

'తరుణి' సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీన్ శుభోత్ కుమార్

సంగెం: తరుణి స్వచ్ఛంద సంస్థ బాలబాలికలకు అందిస్తున్న ఉచిత సేవలను అర్హులు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి)హెల్త్ కేర్ సెంటర్ డీన్ డాక్టర్ శుభోత్ కుమార్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న తరుణి రిసోర్స్ సెంటర్లను హైదరాబాద్‌కు చెందిన ఆస్కి స్టాఫ్, విద్యార్థులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు అవగాహన సదస్సులు, సైకిళ్ల పంపిణీ, సైన్స్ ఫెయిర్, ఫ్రీ కోచింగ్ తదితర ఉచిత సేవల గురించి శుభోత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్కి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్ర సుధీర్, సిబ్బంది హరికృష్ణ, స్రవంతి, స్వర్ణ, రామకృష్ణ, సంస్థ కోఆర్డినేటర్ గుల్లపెల్లి రణధీర్, సిబ్బంది పురుషోత్తం, మానస, శ్రీనివాస్, రామాంజని, భవానీ, మౌనిక, జ్యోతి పాల్గొన్నారు.

'కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలి'

చెన్నారావుపేట: వ్యవసాయ యంత్రీకరణ 2023–24 పైలెట్ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ మాజీ ప్రజాప్రతినిధి, ఏడీఏపై కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేయగా 50 శాతం సబ్సిడీ కింద రైతులు వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చంటూ అబద్ధపు ప్రచారంతో రైతులను మోసం చేశారని తెలిపారు. ఆగ్రో ఏజెన్సీతో కుమ్మక్కై వ్యవసాయ పరికరాల రేట్లను ఇష్టారీతిన మార్చి అధిక రేట్లకు యంత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. అనంతరం ఇరువురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశంలో నాయకులు తొగరు చెన్నారెడ్డి, ఎంపీపీ బాదావత్ విజేందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేష్, తప్పెట రమేష్, మంద యాకయ్య, బండి హరీష్, కుండె కుమారస్వామి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో కాంగ్రెస్ హామీల అమలు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో తప్పకుండా అమలు చేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేయూత స్కీంలో భాగంగా రూ.10లక్షల ఆరోగ్యశ్రీ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, కౌన్సిలర్ జయమ్మ, కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నియోజవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరిని కలిసిన అధికారులు

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని పరకాల ఏసీపీ కిషోర్ కుమార్‌తో పాటు సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం రవిచంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపేందుకు పోటెత్తడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోలాహలం నెలకొంది.

పరకాల జిల్లా కేంద్రం కోసం జర్నలిస్టుల వినతి

ఎంతో చరిత్ర కలిగిన పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించేందుకు కొత్త ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని పరకాల జర్నలిస్టుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రేపాల నర్సింహారాములు, బాబ్జీ, చొల్లేటి సునేందర్, రావుల రాజు, బోజా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై మహాన్యాస రుద్రాభిషేకం



ప్రత్యేక రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మడికొండ: మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, సత్యనారాయణ శర్మ మంత్రోచ్ఛరణ మధ్య రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. దాంతో మెట్టుగుట్ట దేవాలయ ప్రాంగణం శివ నామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా స్వామివారికి 108రకాల ద్రవ్యాలతో స్నపనోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, విష్ణువర్ధనాచార్యులు, దేవేందర్ శర్మ, సాయిశర్మ, మణిశర్మ, ఆలయ సిబ్బంది రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మెట్టుగుట్టపై అయ్యప్ప స్వాములు వైభవంగా ఆరట్టు పూజ నిర్వహించారు. ముందుగా పాల గుండంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. చివరి కార్తీక సోమవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి సోమవారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ శేషుభారతి తెలిపారు. అలాగే, శివపార్వతుల కల్యాణం నిర్వహించి, సాయంకాలం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో స్తంభ నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ధ్రువ, ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం లక్ష్మీ–నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వరస్వామిల కల్యాణం నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి సమర్పించారు.

కార్తీకమాస వనభోజనాలు

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం గ్రామ శివారులో ప్రవాసి రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పాల్గొని సందడి చేశారు. కుటుంబాల సమేతంగా అందరూ ఆటపాటలు నిర్వహించారు. అనంతరం వనభోజనం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంజివర్ధన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రజుమంలో అసోసియేషన్ సభ్యులు వెంకట రంగారెడ్డి, వీరారెడ్డి, ప్రసాద్, ఉషా, శేఖర్, పద్మ, సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు

శాయంపేట : మండల కేంద్రంలోని శివ మార్కండేయ వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. తొలుత అర్చకులు మార్త రాజకుమార్ స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య శివ పార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్య ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.